స్పీకర్‌నైనా.. ప్రజలతో సోదర బంధమే

బండల ఇళ్ల యజమానులకు పక్కా నివాసాలు: ప్రసాద్‌కుమార్


గ్యాస్ సిలిండర్ రాయితీ పత్రాలు అందిస్తున్న శాసనసభాపతి ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

వికారాబాద్, న్యూస్‌టుడే: దిల్లీకి రాజైనా.. తల్లికి కొడుకేనని, అలాగే శాసనసభాపతిని అయినా.. నియోజకవర్గ ప్రజలందరితో సోదర బంధమే పెనవేసుకుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మహాలక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు శుక్రవారం అంబేడ్కర్ భవన్‌లో రూ.500 గ్యాస్ రాయితీ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను అందిస్తుండటం మధురానుభూతిని కలిగిస్తోందని, ఎన్నికల ప్రచారంలో ఊరూరా తిరిగి ఎన్నికల హామీలిచ్చామని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వెళ్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు కష్టపడి ఇప్పుడిప్పుడే పాలనను గాడిలో పెడుతున్నారని ప్రశంసించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల మాటలు గజిని సినిమాలో కథానాయకుడి మాటల్లా ఉన్నాయని, అధికారం కోల్పోగానే అన్నీ మర్చిపోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. బ్యాంకు, సాంకేతిక తప్పిదాలతో రూ.2 లక్షల రుణమాఫీ కాని వారందరికీ డిసెంబరు 9 నాటికి పూర్తిచేస్తామని చెప్పారు. వికారాబాద్ నియోజకవర్గానికి 7 వేల పక్కా ఇళ్లు మంజూరీ చేయించానని, భవిష్యత్తులో బండల ఇళ్లు కనిపించకుండా చేయడమే ధ్యేయమని తెలిపారు. రాజీవ్‌నగర్‌లో వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పరిశీలించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు హరినాథ్, వాసు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు రాజకీయ అనుభవం లేదు

వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌కు రాజకీయ అనుభవం లేదని, భారాస పాలనలో అభివృద్ధి జరగలేదని, మంత్రిగా తానే సిన రోడ్లే ఇంకా ఉన్నాయని గుర్తు చేశారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం: కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న ప్రతీక్‌జైన్

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శుక్రవారం ఆయన సందర్శించి, ఆసుపత్రిలోని విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును తెలుసుకున్నారు. సమస్యలుంటే వాటిని పరిష్కరిస్తామని, వసతులు కల్పిస్తామని చెప్పారు. తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఎంపీవో మహేష్‌కుమార్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బొంరాస్‌పేట నుంచి వికారాబాద్‌కు బస్సు సౌకర్యం


బస్సుకు పూజ చేస్తున్న రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: కొడంగల్, బొంరాస్‌పేట నుంచి వికారాబాద్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించారు. బొంరాస్‌పేటలో శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి బస్సును ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు కొడంగల్‌లో బయలుదేరి బొంరాస్‌పేట మీదుగా వికారాబాద్‌కు వెళ్తుందని, వికారాబాద్‌లో మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి బొంరాస్‌పేట మీదుగా కొడంగల్‌కు చేరుకుని తిరిగి 4 గంటలకు వికారాబాద్‌కు వెళ్తుందని తెలిపారు. పీఏసీఎస్ ఛైర్మన్ జయకృష్ణ, నర్సిములుగౌడ్, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, పాల్గొన్నారు.

లోపం ఎక్కడ?

అంతర్మథనంలో భగీరథ అధికారులు


మిషన్ భగీరథ నీటిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


జాఫర్‌పల్లి వద్ద నీటి శుద్ధి ప్లాంటు

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఇందుకోసం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసినా, ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదు. క్షేత్రస్థాయిలో అధికారులతో పాటు ప్రత్యేక యంత్రాంగం పనిచేస్తున్నా, పరిస్థితిలో మార్పు రావడంలేదు. ప్రజలు తాగేలా వివిధ స్థాయిల్లో ప్రత్యేక అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నా అయిష్టత చూపుతున్నారు. ఎందుకు ఇలా జరుగుతోందని అధికారులు అంతర్మథనం చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లా వ్యాప్తంగా గ్రామ మంచినీటి సహాయకుల వ్యవస్థను తీసుకువచ్చింది. వారి ద్వారా పరిస్థితులను మెరుగుపరిచేలా కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలను సవరించి, ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేలా లక్ష్యం నెరవేరడంలేదు.

ఏం జరుగుతోంది: పల్లెల్లో రోజురోజుకు ఆర్వో ప్లాంట్లు అధికమవుతున్నాయి. ప్రతి ఊరులోనూ ఇవి ఏర్పాటయ్యాయి. 20లీటర్ల డబ్బాకు రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. నీటిని శుద్ధి చేయకుండానే రసాయనాలు వినియోగిస్తున్నారు. తీయగా మార్చి నీటి వ్యాపారం నిర్వహిస్తున్నారు. దీంతో అనారోగ్యం బారిన పడి అవస్థలు పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం సాగిస్తున్న ప్లాంట్లను కట్టడి చేస్తేనే పథకం గాడిన పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

శుద్ధజలంతో ఇవీ లాభాలు

- నాణ్యత ప్రమాణాలతో శుద్ధి చేసిన నీటిని తాగడంతో ఆరోగ్యం
- ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉన్న నీరు నేరుగా అందడం
- ఫ్లోరైడ్ బారిన పడకుండా ఉండటం.

కారణాలు: • ట్యాంకులు పరిశుభ్రంగా లేకపోవడం • పలు చోట్ల భగీరథ, గ్రామాల్లోని బోర్ల నీరు కలిపి పంపిణీ చేయడం • ట్యాంకుపైన, పంపువెల్, వాల్ పిట్స్, ప్రధాన హోల్‌పైన కప్పులు లేకపోవడం • వాల్వ్ పిట్స్‌లో చెత్త చేరడం • పైప్ లైన్ల లీకేజీలు • పైప్‌లైన్లు వెళ్లే ప్రదేశాల్లో మురుగు కాల్వలు ఉండడం • గ్రామస్థాయి పంపిణీలో నాచు కనిపించడం.

రక్షిత నీరు అందించడమే లక్ష్యం



ప్రజలకు స్వచ్ఛత కలిగిన నీటిని అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకోసం మంచినీటి సహాయకులకు శిక్షణ ఇచ్చి ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. డబ్బా నీళ్లతో అనారోగ్యం బారిన పడే ప్రమాదముంది.
– చల్మారెడ్డి, ఈఈ, మిషన్ భగీరథ.

డబ్బా నీటితో నష్టాలు ఇలా



- ఆర్వో ప్లాంట్లలో వాడే మిషనరీ వల్ల ఉండాల్సిన మంచి ఖనిజ లవణాలు కూడా బయటకు వెళ్లి పోయి ద్రవం మాత్రమే మిగులుతుంది. ఆ ద్రవం కేవలం నిర్జీవం కావడంతో ఎలాంటి సుగుణాలు ఉండవు. తద్వారా చాలా మందికి కీళ్ల నొప్పులు, అజీర్ణ వ్యాధులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం
- ఆర్వోప్లాంట్లలో నీటిని శుద్ధి చేసే సమయంలో 60% నీరు వృథా.


జిల్లాలో ఇలా

- పంచాయతీలు – 566
- మండలాలు – 20
- ఆవాసాల సంఖ్య – 974
- భగీరథ నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటు – పరిగి మండలం జాఫర్‌పల్లి
- నిత్యం శుద్ధి జరిగే నీరు – 1.35 కోట్ల మిలియన్ లీటర్లు
- నీటి సరఫరా – శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్
- ఎంత దూరం నుంచి సరఫరా – 231 కిలోమీటర్లు
- వెచ్చించిన వ్యయం – ఉమ్మడి జిల్లాకు రూ.1800 కోట్లు
- పైప్‌లైన్ ఏర్పాటు – 1,920.17 కి.మీ
- కుళాయిల సంఖ్య – 1,98,162
- ఒకరికి ఎన్ని లీటర్లు సరఫరా – గ్రామాల్లో ఒక్కరికి 100, మున్సిపాలిటీల్లో 135

న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్,

పచ్చటి పొలాలు.. ఫార్మాకు ఇవ్వం

- ఔషధ పరిశ్రమ వద్దంటూ రైతుల నిరసన
- దుద్యాల మండలంలో ఆందోళన


పంచాయతీ భవనం ముందు భారీగా మోహరించిన పోలీసులు; గాయపడ్డ రైతు (అంతర్‌చిత్రంలో)

న్యూస్‌టుడే, బొంరాస్‌పేట, దుద్యాల, కొడంగల్: ఫార్మా కంపెనీకి భూములు ఇచ్చేది లేదని రైతులు ఆందోళన బాటపట్టారు. దాదాపు 14వందల ఎకరాల్లో ఔషధాల తయారీ పరిశ్రమకు శ్రీకారం చుట్టినా.. ఎకరం భూమి కూడా ఇవ్వడానికి వారు ససేమిరా అంటున్నారు. భూసేకరణకు అధికారులు పల్లెలకు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఏమైందంటే?: సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం దుద్యాల మండలంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన భూమిని దుద్యాల, లగచెర్ల, పోలేపల్లి, పులిచెర్లకుంటతండా, రోటిబండతండాల పరిధిలో సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిల్లో ఎక్కువ శాతం పట్టా భూములే ఉన్నాయి. వాటిపైనే ఆధారపడి జీవిస్తున్న తాము ఫార్మా కంపెనీలకు భూములిస్తే ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేయడంతో రైతులు ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు, తహసీల్దార్ కార్యాలయం ముట్టడి తదితర కార్యక్రమాలు చేపట్టారు. భూ సేకరణకు గ్రామాలకు వచ్చే అధికారులను అడ్డుకుంటున్నారు. తాజాగా శుక్రవారం లగచెర్ల గ్రామానికి అదనపు కలెక్టర్, ఇతర అధికారులు వస్తున్నారని తెలియడంతో రైతులు వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.


ప్రత్యేక బలగాల వలయం మధ్య శేఖర్‌ను తీసుకెళ్తున్న పోలీసులు

ఆందోళనకు కారణాలు..

- ఫార్మా కంపెనీ ఏర్పాటుతో వాయు, నీటి కాలుష్యం ఏర్పడుతుందని, కాలుష్యకారక కంపెనీలను ఏర్పాటు చేస్తే.. తమ భూముల్లో పంటలు పండవని, ప్రజలు అనారోగ్యాల పాలవుతారని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.
- ఫార్మా కంపెనీ కోసం ప్రభుత్వం 1,350 ఎకరాలను సేకరించాలని నిర్ణయించింది. ఇందులో ప్రభుత్వ భూమి కేవలం 156 ఎకరాలు మాత్రమే. మిగతా భూమి రైతుల పట్టాభూమి.
- ప్రభుత్వం ఇప్పటికే లగచెర్ల, పోలేపల్లి గ్రామాల పరిధిలో 703.65 ఎకరాల భూమిని సేకరించడానికి నోటిఫికేషన్ జారీ చేసింది.

భూమే నాకు ఆధారం



వ్యవసాయమే మాకు ఆధారం. వయసు మీదపడడంతో, పిల్లలకు భూమి ఇద్దామని అనుకున్నా. ప్రభుత్వం సేకరించాలని చూస్తోంది. అన్నం కూడా తినాలనిపించడం లేదు. – రాములు, రైతు

నిర్ణయం మార్చుకోవాలి



భూమిని ఫార్మా కంపెనీలకు ఇవ్వం. మిమ్మల్ని గెలిపించింది ఇందుకేనా? . ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోవాలి. లేకుంటే మరింతగా ఉద్యమిస్తాం.
– సంగు వెంకటయ్య, రైతు లగచెర్ల.

పని చేస్తేనే.. ఉపాధి కార్డు

గ్రామాల వారీగా పరిశీలన



న్యూస్‌టుడే, వికారాబాద్, తాండూరు: ఉపాధి హామీ పథకంలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. పనులు పక్కాగా జరిగేందుకు జియోట్యాగింగ్ విధానంలో భువన్ యాప్ ద్వారా వెబ్‌సైట్‌లో పనుల చిత్రాలు, వివరాలు పొందుపరుస్తున్న విషయం తెలిసిందే. ఇదే క్రమంలో పనులకు రాని వారి కార్డులను తొలగించే కార్యక్రమం చేపట్టారు. పథకం మార్గదర్శకాల ప్రకారం నిరుపేదలై ఉండి, కూలీకి వెళ్లే వారికే ఉపాధి కార్డులు ఇవ్వాలి. పలుచోట్ల అనర్హులు, ఒక్కసారి కూడా పనికి వెళ్లని వారి వద్ద కార్డులున్నాయి. వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం పథకాలను ఉపాధి కార్డు ఉన్న వారికి వర్తింపజేస్తుండటంతో ఆయా ప్రయోజనాలు అనర్హులు, కూలీ పనులకు వెళ్లని వారు పొందుతున్నారు.

వివాహం అయినా.. శాశ్వతంగా వలస వెళ్లినా..: పలు గ్రామాల్లో కుటుంబాలు శాశ్వతంగా వలస వెళ్లినా, మృతి చెందినా, పెళ్లి చేసుకొని అత్తారింటికి వెళ్లిన మహిళల పేర్ల మీద కార్డులు కొనసాగుతున్నాయి. దీనివల్ల పథకం దుర్వినియోగమయ్యేందుకు ఆస్కారం కలుగుతోంది. ఈ మేరకు కార్డులు పొందిన వారిలో పనులకు వెళ్తున్న వారెవరనేది గుర్తించేందుకు గ్రామాల వారీగా పరిశీలన ప్రక్రియ ప్రారంభించారు. ఇప్పటి వరకు జారీ చేసిన కార్డుల జాబితా ఆధారంగా పథకం క్షేత్రస్థాయి సిబ్బంది పరిశీలన జరుపుతున్నారు.

ఇవీ వివరాలు..

- పంచాయతీలు: 566
- మొత్తం జాబ్ కార్డులు: 1,82,794
- లబ్ధి పొందిన కుటుంబాల సంఖ్య: 96,381
- లబ్ధి పొందిన సభ్యుల సంఖ్య: 1,69,393
- కల్పించిన పని దినాలు: 48,66,752
- చెల్లించిన కూలి డబ్బులు: 90.46 కోట్లు

గ్రామసభల్లో పంపిణీ..: డిసెంబరు నెలాఖరులోగా అన్ని గ్రామాల్లో కార్డుల పరిశీలన పూర్తి చేసి, జనవరిలో జరిగే గ్రామసభల్లో పంపిణీ చేయనున్నారు. అర్హులై ఉండి ఉపాధి పనులకు వచ్చే కూలీలకు మాత్రమే జారీ చేయనున్నారు. సాధారణ కూలీలు, దివ్యాంగులకు వేర్వేరుగా వీటిని ఇవ్వనున్నారు. గ్రామసభల్లో తీర్మానం చేసిన పనులను చేపట్టనున్నారు.

కోకట్‌ను సందర్శించిన ఉన్నతాధికారులు


పచ్చళ్లను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్లు రవీందర్, జాన్‌వెస్లీ

యాలాల, న్యూస్‌టుడే: నేషనల్ పంచాయతీ అవార్డుకు యాలాల మండలం కోకట్ గ్రామాన్ని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి అదనపు కమిషనర్లు రవీందర్, జాన్‌వెస్లీ గ్రామాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలో స్థానిక అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, మహిళ సంఘాలు, ఉపాధిహామీపై వారితో సమీక్షించారు. మహిళ సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన పచ్చళ్ల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పంచాయతీలోని దస్త్రాలను పరిశీలించి, ప్రతి అంశాన్ని అంతర్జాలంలో నమోదు చేయాలని కార్యదర్శికి సూచించారు. డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారిణి సంధ్యారాణి, డీఎల్‌పీవో శంకర్‌నాయక్, ఎంపీడీవో పుష్పలీల, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రేగడిమైలారానికి నేడు సీఎం రాక

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: సీఎం రేవంత్‌రెడ్డి శనివారం మండలంలోని రేగడిమైలారం గ్రామానికి రానున్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సీనియర్ నాయకుడు నర్సిరెడ్డి కుటుంబాన్ని ముఖ్యమంత్రి పరామర్శించనున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో మద్దూరు చేరుకుని, అక్కడి నుంచి కొడంగల్‌కు చేరుకుంటారు. సీఎం రాక సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఎంపీడీవో వెంకన్‌గౌడ్‌ను ఆదేశించారు. శుక్రవారం బొంరాస్‌పేటకు వచ్చిన కలెక్టర్ ఎంపీడీవో కార్యాలయంలో సీఎం పర్యటన గురించి చర్చించారు.



తాండూరు అభివృద్ధికి నిధులు ఇవ్వండి

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సచివాలయంలో గురువారం రాత్రి కలిశారు. తాండూరు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని అంశాలపై ఆయనతో ప్రస్తావించారు. – న్యూస్‌టుడే, తాండూరు.

భగీరథ నీటితో ఆరోగ్యం

వికారాబాద్ గ్రామీణ, యాలాల : ప్రజలకు శుద్ధ జలాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈఈ చల్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలోని సమావేశ మందిరంలో భగీరథ నీటి సరఫరా సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం మినరల్ వాటర్, శుద్ధిచేసిన, భగీరథ నీటిని పరీక్షించి ఏ నీరు తాగితే ఉపయోగమో వివరించారు. భగీరథ నీటిని తాగడం ఆరోగ్యకరమన్నారు. ఎవరికైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ రత్నప్ప, ఏఈ రాకేష్, ఎంపీడీవో వినయ్‌కుమార్, ఎంపీవో దానయ్య పాల్గొన్నారు.

- గ్రామాలకు మంచినీటిని అందించే బాధ్యత గ్రామీణ మంచినీటి సహాయకులదేనని డీఈ విజయ్‌కుమార్ అన్నారు. యాలాల రైతువేదికలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి రోజు శిక్షణలో భాగంగా 37 పంచాయతీ సహాయకులకు పైప్‌లైన్ అతికించే విధానాన్ని వివరించామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

చెరువుకు చేరుతున్న చేప


చేపలు వదిలిన కోట్‌పల్లి జలాశయం

న్యూస్‌టుడే, తాండూరు, వికారాబాద్: జిల్లాలో నిర్ణీత చెరువుల్లో చేపలను వదిలేందుకు మత్స్యశాఖ కార్యాచరణ ప్రారంభించింది. రెండు విడతల్లో 64.4 లక్షల పిల్లలను వదలనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.46 లక్షలను వ్యయం చేస్తోంది. మొదటి విడతలో 11 పెద్ద చెరువులు, మూడు చెక్‌డ్యాంల్లో పెద్ద పరిమాణంలో ఉండే చేప పిల్లలను వదలాలని నిర్ణయించారు. ఇటీవలే కోట్‌పల్లి జలాశయంలో 2.77లక్షల పిల్లలను వదిలారు. తాండూరు మండలం అల్లాపూర్ జలాశయంలో శుక్రవారం 77 వేల పిల్లలను వదిలారు. మిగిలిన వాటిల్లో దశల వారీగా వదలనున్నారు. ఈ ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వేసవి వరకు మాత్రమే నీరుండే చెరువుల్లో చిన్న పరిమాణంలో ఉండే వాటిని వదులుతారు. చిన్నవి పెంచేందుకు జిల్లాలో 20 మండలాల్లోని 813 చెరువులను గుర్తించారు.

పెద్దవి వదిలేవి: మంగోని చెరువు(బొమ్‌రెడ్డిపల్లి), కాకరవేణి ప్రాజెక్టు(ఏర్పుమల్ల) శ్రీరాముల వారి ప్రాజెక్టు (జిన్‌గుర్తి), జుంటుపల్లి వాగు ప్రాజెక్టు(జుంటుపల్లి), నందివాగు ప్రాజెక్టు(కాస్లబాద్), కొంశెట్‌పల్లి ప్రాజెక్టు(కొంశెట్‌పల్లి), లఖ్నాపూర్ ప్రాజెక్టు(లఖ్నాపూర్), చిన్నవాగు ప్రాజెక్టు(ముద్దాయిపేట), సర్పన్‌పల్లి ప్రాజెక్టు(సర్పన్‌పల్లి).

ఇవీ లెక్కలు

- పెద్ద చేప పిల్లల పరిమాణం: 80ఎం.ఎం నుంచి 100 ఎం.ఎం
- 14 చెరువుల్లో వదిలే సంఖ్య: 13.40 లక్షలు
- ఖర్చు: రూ.21 లక్షలు
- చిన్నవాటి పరిణామం: 35ఎం.ఎం. నుంచి 40 ఎం.ఎం
- 813 చెరువుల్లో వదిలే సంఖ్య: 51లక్షలు
- ఖర్చు: రూ.25లక్షలు
- మత్స్య సహకార సంఘాలు: 145
- సభ్యులు: 5,320

చెక్ డ్యాంలు: బషీరాబాద్ మండలం క్యాద్గిర, పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి, తాండూరు మండలం తాండూరు.

మత్స్యకారుల ఆర్థిక అభ్యున్నతికి కృషి

మత్స్యకారులు ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోంది. నీటి వనరుల్లో ఉచితంగా చేపపిల్లలను వదులుతున్నాం. పెద్ద పరిమాణంలో ఉన్నవాటిని వదులుతున్నాం. చిన్నవి సమకూరగానే ప్రక్రియ ప్రారంభిస్తాం. నీరు సమృద్ధిగా ఉంటే చేపలు ఆరోగ్యంగా పెరుగుతాయి. – ఎం.వెంకయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి.

సమాజహితమే పోలీసుల ధ్యేయం: ఎస్పీ


రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలు అందిస్తున్న నారాయణరెడ్డి

వికారాబాద్, న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో వికారాబాద్ తనిఖీ కేంద్రం నుంచి అనంతగిరి పర్యాటక భవనం వరకు 3కె సైకిల్ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. యువకులు, విద్యార్థులు, వికారాబాద్ వాకర్స్ సంఘం ప్రతినిధులు 450 మంది ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సమాజహిత కార్యక్రమాల్లో పోలీసులు పాల్గొని ప్రజల్లో మంచి పేరు తీసుకురావాలని కోరారు. రక్తదానం చేసిన 83 మంది పోలీసులు, ఇతరులకు ధ్రువ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ ఏఎస్పీ మురళీధర్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేష్, రెడ్‌క్రాస్ సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిచౌదరి, ఉపాధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సకల సౌకర్యాలు


మాట్లాడుతున్న అధికారి భీంరాజ్

యాలాల, న్యూస్‌టుడే: యాలాల మండల కేంద్రంలోని బాలికల, బాలుర వసతిగృహాన్ని జిల్లా సహాయ బీసీ వసతి గృహ అభివృద్ధి అధికారి భీంరాజ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు, అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు నాలుగు జతల దుస్తులు, ఆట సామగ్రిని అందించామన్నారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా? లేదా అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు.

మాతను స్మరించి.. పారాయణం చేసి..



వికారాబాద్ శివరాంనగర్ కాలనీలో కొలువైన సంతోషిమాతదేవి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటరమణ, నవీన్‌కుమార్ భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి అభిషేకం, కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భగవద్గీత, విష్ణు సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ప్రముఖ వక్తలు గొల్లపల్లి అంజిరెడ్డి, రఘునాథ్ పంతులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ.

ఒడిదొడుకులు దాటి.. సివిల్స్ సాధించి..



న్యూస్‌టుడే, తూప్రాన్, మనోహరాబాద్

ఒకరిది పేద కుటుంబం.. మరొకరికి అత్యున్నత ఉద్యోగమే లక్ష్యం.. ఇలా తమ లక్ష్యాల సాధనకు ఎంతో శ్రమించారు. ఎన్నో అడ్డంకులను అధిగమించారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసి తాము అనుకున్నది సాధించారు. లక్షల మంది పోటీపడిన ఈ పరీక్షల్లో తామెంటో నిరూపించుకున్నారు. ఎన్నో ఒడుదొడుకులు దాటుకొని ఇక్కడి వరకు వచ్చారు. ప్రజాసేవే ధ్యేయంగా సివిల్ సర్వీసెస్ సాధించిన వారంతా పల్లెల బాట పట్టారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలు లబ్ధి పొందుతున్న తీరు, జీవనస్థితిగతులను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి పర్యటనకు మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్, మనోహరాబాద్ మండలం కూచారం గ్రామాలకు వచ్చారు. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే' వారిని పలకరించింది. ఆయా విశేషాలు వారి మాటల్లోనే ఇలా..

కిరాణా వ్యాపారి కుమారుణ్ని



మాది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మహాసముండ్ గ్రామం. మధ్యతరగతి కుటుంబం. 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. తండ్రి కిరాణా దుకాణం నిర్వహిస్తూ మమల్ని పోషించారు. తల్లి గృహిణి. నాన్నకు సహకారాలు అందించేది. ఇంట్లో కష్టాలను చిన్నప్పటి నుంచి చూశా. వాటిని అధిగమించాలంటే ఉన్నత స్థానానికి చేరాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. సివిల్స్ సాధించడమే ధ్యేయంగా సన్నద్ధమయ్యా. రెండుసార్లు విఫలం కాగా, మూడోసారి ఉత్తమ ర్యాంకు సాధించగా ఐపీఎస్ వచ్చింది. కరోనా సమయంలో ఎంపికయ్యా. దీని కారణంగా క్షేత్రస్థాయి శిక్షణ పూర్తికాలేదు. అందులో భాగంగానే ఇప్పుడు ఇక్కడికి వచ్చా. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌లో ఉద్యోగం చేస్తున్నా. చదువుకు కులమతాలు, ధనిక, పేద అన్న తేడా లేదు. కష్టపడితే ఏదైనా సాధ్యమే. యువతీ, యువకులు అందరూ గమ్యం నిర్దేశించుకుని తల్లిదండ్రుల కలను సాకారం చేయాలి. **- ఆకాష్‌కుమార్ శుక్లా, ఐపీఎస్ అధికారి**

సాఫ్ట్‌వేర్ కొలువు కాదనుకొని..



మాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవూ. ఐఐటీ బొంబాయిలో బీటెక్ పూర్తి చేశా. చిన్నప్పటి నుంచి ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు పడలేదు. బీటెక్ తర్వాత సాఫ్ట్‌వేర్ కంపెనీలో అత్యున్నత జీతంతో ఉద్యోగం వచ్చింది. కొద్దిరోజులు ఉద్యోగం చేశాక, అది నచ్చలేదు. ప్రజలకు ఏదైనా సేవ చేయాలన్న తలంపుతో సివిల్ సర్వీస్‌ను ఎంచుకున్నా. ఇందులో ఉద్యోగమే లక్ష్యంగా అడుగేశా. శిక్షణ తీసుకున్నాం. రెండుసార్లు సివిల్స్ రాసి విఫలమయ్యా. అయినా కుంగిపోలేదు. కుటుంబ సభ్యులు సహకారం అందించారు. మూడోసారి విజయం వరించగా, ఐఈఎస్(ఇండియన్ ఎకనామిక్ సర్వీస్) వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవనంలో మార్పు తీసుకురావాలంటే ప్రభుత్వం ఎంతో చేయాల్సి ఉంటుంది. అందులో సివిల్ సర్వీస్ అధికారులదే కీలక పాత్ర. నేటి యువత పోటీ పరీక్షల్లో ఉద్యోగం రాలేదని ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ధైర్యంగా ముందుకు సాగితే విజయం ఖాయం. **- జాన్వీపటేల్, లఖ్‌నవూ, ఉత్తర్‌ప్రదేశ్**

నాన్న స్ఫూర్తిగా అడుగేశా..



నా స్వగ్రామం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్. నాన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ గృహిణి. చిన్నతనంలోనే సివిల్స్ సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. ఈ విషయంలో నాన్నే నాకు స్ఫూర్తి. ఆయన సూచనలతో ముందుకు సాగా. పోటీ పరీక్షల్లో రాణించేందుకు మెలకువలు నేర్చుకున్నా. రోజులో 16 గంటల పాటు చదివాను. సివిల్స్‌కు సంబంధించి అన్ని విషయాలపై అవగాహన పెంచుకున్నా. దీని గురించి చరవాణిని సైతం కొన్నాళ్లు దూరంగా ఉంచా. అవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగించాను. 2023లో తొలిసారిగా పరీక్ష రాయగా ఉత్తీర్ణత సాధించా. ఐఈఎస్(ఇండియన్ ఎకనామిక్ సర్వీస్) వచ్చింది. క్షేత్రస్థాయి పర్యటనలో పక్కాగా పథకాలు అమలు చేస్తే ప్రజలకు ఎంతో మేలు చేయవచ్చని తెలుసుకున్నా. **- వైభవ్ రాథోడ్, శిక్షణ ఐఈఎస్ అధికారి**

తెలంగాణ క్యాడర్‌లోనే..



మాది మహారాష్ట్ర. నాన్న కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఆయన స్ఫూర్తితోనే పోలీసు శాఖలో చేరాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. అందులోనూ ఐపీఎస్ సాధించాలని సంకల్పించుకున్నా. దీని గురించి అన్ని రకాలుగా తెలుసుకున్నా. ఎప్పటికప్పుడు పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకున్నా. మొదటి సారి పరీక్ష రాయగా విఫలమయ్యాను. రెండోసారి విజయం సాధించా. అత్యుత్తమ ర్యాంకు రాగా, ఐపీఎస్‌కు ఎంపికయ్యా. ప్రస్తుతం తెలంగాణ క్యాడర్‌లో మహబూబ్‌నగర్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నా. క్షేత్రస్థాయి శిక్షణ పూర్తికాకపోవడంతో ఇప్పుడు ఇక్కడికి వచ్చా. నా తండ్రి కలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో కష్టపడి చదివా. రోజులో 16 గంటలు దీనికే కేటాయించా. ఆత్మవిశ్వాసంతో అడుగేస్తే విజయం ఖాయమని నా ఉద్దేశం. **- చేతన్‌నితిన్, ఐపీఎస్ అధికారి**

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ప్రతినిధి జశ్వంత్

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: రోబోటిక్స్ విద్యతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడంతో పాటు సమస్యల పరిష్కార నైపుణ్యాలు మెరుగుపర్చడమే ప్రధాన ధ్యేయమని సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ప్రతినిధి జశ్వంత్ అన్నారు. శుక్రవారం మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ సహకారంతో రోబోటిక్స్ ఆన్ అకాడమిక్ (ఆర్ఏఏ) అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జశ్వంత్ మాట్లాడుతూ.. సైన్స్‌ను ఇష్టంగా అభ్యసించాలని, తద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 16 జిల్లాల్లోని 285 పాఠశాలల్లో 47,875 మంది విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ ఇచ్చామని చెప్పారు. త్వరలో మరిన్ని చోట్ల ప్రారంభిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ.. రోబోటిక్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. భౌతికశాస్త్రం విద్యార్థులు 80 మందికి శిక్షణ ఇచ్చారు. జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి సింహారెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ తిరుమల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధనలక్ష్మిగా వాసవీమాత



దుబ్బాక పట్టణం వైశ్యభవన్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. అమ్మవారిని రూ.11 లక్షల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి మాతగా అలంకరించి పూజలు చేశారు.

- న్యూస్‌టుడే, దుబ్బాక

రోగుల నాడి పట్టి చూస్తున్నారా..!



నర్సాపూర్ ఆసుపత్రిలో సేవలపై ఆరా తీస్తున్న రాష్ట్ర కమిషనర్ అజయ్ కుమార్

నర్సాపూర్, కౌడిపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా ఉంటూ, వారి నాడి పట్టి పరీక్షించాలని రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ స్పష్టంచేశారు. శుక్రవారం నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌పేషంట్ల విభాగం, ఓపీ నిర్వహణను పరిశీలించారు. వేచి ఉన్న రోగులతో మాట్లాడారు. వైద్యులు నాడి పట్టి చూస్తున్నారా, అవసరమైన మందులు ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలందించాలని ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ పావనికి సూచించారు. జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకుడు డాక్టర్ శివదయాళ్, వైద్యులు మిర్జాబేగ్, రాజేష్, వంశీ తదితరులు ఉన్నారు. అనంతరం కౌడిపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న సామాజిక ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఇక్కడికొచ్చే రోగుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలని స్పష్టంచేశారు. వైద్యులు, సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని సూచించారు. వైద్యురాలు మహిమ, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ ఉన్నారు.

ఐఐటీహెచ్‌లో అంకుర సంస్థల సదస్సు

సంగారెడ్డి టౌన్, కంది, న్యూస్‌టుడే: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల ఉత్పత్తిదారులకు చేయూతే లక్ష్యంగా సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీహెచ్‌లో శుక్రవారం స్టార్టప్, ఇన్వెస్టర్ల సదస్సు నిర్వహించారు. వీసీ సర్కిల్-ప్యూర్ ఈవీ అంకుర సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 60 అంకుర సంస్థలు, 130 మంది యువ పారిశ్రామికవేత్తలు, దేశ విదేశాలకు చెందిన 30 మంది పెట్టుబడిదారులు ఇందులో భాగస్వాములయ్యారు. అంకుర సంస్థల ప్రతినిధులు తమ ఆలోచనలను పెట్టుబడిదారుల ముందుంచారు. ఆధునిక సాంకేతికత ఆలోచనతో రూపొందించిన ప్రాజెక్టులతో ముందుకు వచ్చే అంకుర సంస్థల్లో పెట్టుబడులకు పలువురు ఆసక్తి చూపారు. అంతకు ముందు 'భారత దేశంలో ఎలక్ట్రిక్ వాహన విప్లవం-భవిష్యత్తు' అనే అంశంపై రూపొందించిన శ్వేతపత్రాన్ని ఐఐటీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్, ప్యూర్ ఈవీ(ఎలక్ట్రికల్ వెహికిల్) వ్యవస్థాపక ఛైర్మన్ డా.నిశాంత్ దొంగరి ఆవిష్కరించారు.

ఇంట్లో చోరీ.. ముగ్గురు మహిళల అరెస్టు

కల్హేర్, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో దొంగతనం చేసిన ముగ్గురు మహిళలను అరెస్టుచేసి ఆభరణాలతో పాటు నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కల్హేర్ ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాలు.. ఈనెల 15న కల్హేర్‌కు చెందిన బత్తిని పద్మవ్వ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ విషయం పసిగట్టిన ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు చెగోళ్ల చంద్రకళ, మీసాల గంగవ్వ, అల్లాపూరం ఉమారాణిలు జతకలిసి అదేరోజు పద్మవ్వ ఇంటి తాళం పగులగొట్టి ఆభరణాలతోపాటు నగదు చోరీకి పాల్పడ్డారు. నిందితులు సొత్తును సమీపంలోని గ్రామంలో అమ్మకం చేయడంతో విషయం బయటకు వచ్చింది. కేసు విచారణ ప్రారంభించిన పోలీసులు నిందితులు అమ్మిన రెండు తులాల బంగారు పుస్తెల తాడు, 20 తులాల వెండి కడియాలు, పది తులాల పట్ట గొలుసులతో పాటు రూ.30 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

కారు షెడ్డులో అగ్నిప్రమాదం

ఆహుతైన 9 వాహనాలు



కాలిపోయిన కార్లు

తూప్రాన్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి నర్సాపూర్ చౌరస్తా సమీపంలోని కారు షెడ్డులో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఎస్సై శివానందం తెలిపిన వివరాలు.. నర్సాపూర్ చౌరస్తా సమీపంలో కారు మెకానిక్ షెడ్డు ఉంది. గురువారం రాత్రి ఎప్పటిలాగే షెడ్డుకు తాళం వేసి నిర్వాహకులు, కార్మికులు వెళ్లిపోయారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కార్లున్న షెడ్డులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో అందులోని తొమ్మిది కార్లు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానికులు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక యంత్రాలు మంటలను అదుపులోకి తెచ్చాయి. షెడ్డులోని కార్లు కాలిపోయాయి. ప్రమాదం ఎలా జరిగిందనే విషయమై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మోసపోయాం న్యాయం చేయండి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

మోమిన్‌పేట: మేము కొనుగోలు చేసిన స్థలాల్లో, పంటలు సాగు చేస్తున్నారని, మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితులు రెవెన్యూ అధికారులకు శుక్రవారం విన్నవించారు. అధికారులు, బాధితులు తెలిపిన ప్రకారం మండల పరిధి ఎన్కెపల్లి శివారు 86 సర్వే నంబరులో షేక్‌బద్రోద్దీన్ వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి, ప్లాట్లుగా విక్రయించాడు. 34 మందికి వికారాబాద్‌లో రిజిస్ట్రేషన్ చేశాడు. లేఅవుట్ లేని భూముల్లో ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసిన వారి ప్లాట్లను ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో బాధితులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇంటి స్థలాలు పరిశీలించేందుకు అధికారులు శుక్రవారం వస్తారని పంచాయతీ కార్యదర్శి పార్వతమ్మ దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారంతా పత్రాలతో కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాల వద్దకు వెళ్లి చూడగా, ఆ భూమి చుట్టూ ప్రహరీ ఉండడంతో వారికి ఏంచేయాలో అర్థం కాలేదు. స్థలాలు చూపిస్తేనే ఎల్ఆర్ఎస్ చేసే వీలుంటుందని క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన అధికారులు చెప్పడంతో ఆందోళనకు గురయ్యారు. తమకు జరిగిన అన్యాయాన్ని ఉప తహసీల్దార్ సురేష్‌కు వివరించి, వినతిపత్రం ఇచ్చారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు	115-00	
రిటైల్	137-00	
డ్రెస్డ్	199-00	
స్కిన్‌లెస్	226-00	

పిడుగు గుట్టు తెలిపేలా..



యాప్‌లో వివరాలు

ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసినప్పుడు ఎక్కడో చోట పిడుగు పడిందని మనకు తెలుస్తుంటుంది. దాని కారణంగా మనుషులు సైతం మృతి చెందుతుంటారు. అత్యధికంగా అటవీ ప్రాంతం, ఎత్తయిన కొండ ప్రాంతాల్లో ఇవి పడుతుంటాయి. పిడుగుపాటు ప్రమాదాన్ని ముందే గుర్తించేలా భారత వాతావరణ విభాగం, శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దామిని లైట్‌నింగ్ అలర్ట్ పేరిట దీన్ని రూపొందించింది. దీని ద్వారా మనం ఉన్న ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో లేదో ముందే తెలుసుకొని జాగ్రత్త పడొచ్చు.

హెచ్చరించేలా..

భారత వాతావరణ విభాగం (ఐఎండీ), శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఐఐటీఎం పూణే రూపొందించిన దామిని లైట్‌నింగ్ అలర్ట్ (Damini lightning Alert) యాప్ ద్వారా ముందే పిడుగుపాటును తెలుసుకోవచ్చు. ముందుగా ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ లేదంటే యాపిల్ యాప్‌స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం ఫోన్‌లో జీపీఎస్ ఎనేబుల్ చేసి పేరు, మొబైల్ నంబరు, చిరునామా, పిన్‌కోడ్ వంటి వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత మీరున్న ప్రాంతానికి 20-40 కి.మీ. పరిధిని ఒక సర్కిల్‌గా చూపిస్తుంది. అక్కడ పిడుగు పడుతుందా, లేదంటే ఎంత సేపట్లో పడుతుందనేది హెచ్చరిస్తుంది. ఆయా హెచ్చరికలను మూడు రంగుల్లో (ఎరుపు, పసుపు, నీలం) వ్యవధి సమయాన్ని సూచిస్తుంది.

- ఎరుపు ఉంటే 7 ని.లు, పసుపు ఉంటే 10-15 ని., నీలం ఉంటే 18-25 నిమిషాల్లో అక్కడ పిడుగు పడే వ్యవధిని సూచిస్తుంది.

మేఘాలు ఢీకొని..

ఆకాశంలో వేగంగా కదిలే మేఘాలు ఒకదాన్ని ఒకటి ఢీకొన్నప్పుడు విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దాని ప్రసరణకు ఒక వాహకం అవసరం. భూమ్యాకర్షణతో పిడుగు రూపంలో నేలపైకి విద్యుత్తు ప్రసరిస్తుంది. దీని శక్తి సూర్యుడి ఉపరితల శక్తి కన్నా ఎన్నో రెట్లు ఎక్కువని పలు పరిశోధనల్లో తేలింది. మేఘాలు, భూమికి మధ్య ఉండే గాలి పిడుగును నేల వైపునకు చేరుస్తుంది. ఒక పిడుగుతో సుమారు 30 కోట్ల వోల్టుల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని అంచనా.

యాప్ రాడార్ ద్వారా సమాచారాన్ని సేకరించి జీపీఎస్ ద్వారా మనకు తెలియజేస్తుంది. తెలుగుతో పాటు 23 భాషల్లో సమాచారం అందిస్తుంది. మనం ఉన్న ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉంటే యాప్ నోటిఫికేషన్ వస్తుంది. తద్వారా అప్రమత్తం కావొచ్చు. పొలాల వద్ద పని చేసే రైతులు, పశుకాపరులు, ఆరు బయట పనిచేసే వారికి ఇదెంతో ఉపయోగకరం.

- న్యూస్‌టుడే, పాపన్నపేట

భార్యను హత్య చేసిన భర్త రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంతోష్‌కుమార్

న్యూస్‌టుడే, తాండూరు: భార్యను కొట్టి చంపిన భర్తను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. తాండూరు పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం యాలాల మండలం కమాల్‌పూర్ గ్రామానికి చెందిన మ్యాతరి శ్రీకాంత్, ఆయన భార్య సుజాత(23) పాత తాండూరు రైల్వేగేటు సమీపంలో నివాసం ఉంటున్నారు. భార్యను అనుమానించిన శ్రీకాంత్ గురువారం రాత్రి ఆమెపై దాడి చేసి కొట్టాడు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం తెలియడంతో వెంటనే అక్కడికి వచ్చి జిల్లా ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నామని వివరించారు.

ద్విచక్ర వాహనాల దొంగ జైలుకు..

రాయపోల్, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తొగుట సీఐ లతీఫ్ పేర్కొన్నారు. రాయపోల్ ఠాణాలో ఆయన వెల్లడించిన వివరాలు.. రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామానికి చెందిన కోనేరు యాదగిరి మద్యానికి బానిసయ్యాడు. 15 రోజుల క్రితం మరోవ్యక్తితో కలిసి హైదరాబాద్‌లో బోయిన్‌పల్లి మార్కెట్ సమీపంలోని బాపూజీనగర్‌లో రోడ్డుపక్కన నిలిపిన బైక్‌ను దొంగిలించి అనాజీపూర్‌లో ఓ వ్యక్తికి విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. ఈనెల 18న రాయపోల్ వైన్స్‌లో మద్యం తాగి జీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ ముందు నిలిపిన స్కూటీని దొంగిలించారు. శుక్రవారం స్కూటీని హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తుండగా రాయపోల్ సబ్‌స్టేషన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా దొంగతనం కేసులు బయటపడ్డాయని సీఐ వివరించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

రైతులకు ఉపాధినిచ్చే పనులకే ప్రాధాన్యం



వివరాలు ఆరా తీస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర ప్రోగ్రాం అధికారి కృష్ణమూర్తి

చేర్యాల (మద్దూరు), న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం కింద 2025-26 సంవత్సరానికి గాను రూపొందిస్తున్న ప్రణాళికలో రైతులకు ఉపాధితో పాటు ప్రజా ప్రయోజనం ఉన్న పనులకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎన్ఆర్ఈజీఎస్ ప్రోగ్రాం రాష్ట్ర మేనేజరు కృష్ణమూర్తి సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూరు, ధర్మారం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. గతేడాది చేపట్టిన పనులు, వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తయారు చేసిన ప్రణాళికలో పేర్కొన్న పనుల ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. పనుల్లో ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేలా చూడాలన్నారు. అందరికీ ఉపయోగపడే వాటికే ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. శతశాతం పూర్తిచేసేలా కార్యాచరణ ఉండాలని స్పష్టంచేశారు. జిల్లా ఏపీడీ శివాజీ, కోఆర్డినేటర్ (లైజన్ అధికారి) నూరుద్దీన్, ఎంపీడీవో రామ్మోహన్, ఏపీవో పరశురాములు, సాంకేతిక సహాయకులు దేవేందర్, శ్రీనివాస్, వెంకటమ్మ తదితరులున్నారు.

కళాఉత్సవ్ పోటీల్లో కేంద్రీయ విద్యార్థుల ప్రతిభ



బృందగానంలో పాల్గొన్న విద్యార్థులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఏక్‌భారత్ శ్రేష్ఠ్‌భారత్‌లో భాగంగా ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నంలో నిర్వహించిన కళాఉత్సవ్ పోటీల్లో సిద్దిపేట కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలలోని ఏడు నుంచి 10వ తరగతికి చెందిన 12 మందితో కూడిన బాలబాలికల జట్టు అక్కడి రీజినల్ స్థాయిలో నిర్వహించిన బృందగానం పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని విద్యాలయ ప్రిన్సిపల్ సూర్యప్రకాశ్, కో-ఆర్డినేటర్లు సంధ్య, పీఈటీ భూమయ్య తెలిపారు. నవంబరు 11 నుంచి మూడు రోజులపాటు హైదరాబాద్ తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో ఈ బృందం పాల్గొంటుందని వారు వెల్లడించారు. ఈ మేరకు విజేతలను అభినందించారు.

విజ్ఞాన ప్రదర్శనకు సిద్ధమవుదాం..

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట, సిద్దిపేట, వికారాబాద్ కలెక్టరేట్

నవంబరులో నిర్వహణకు ఆదేశాలు



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు

భావి శాస్త్రవేత్తలను రూపొందించడమే లక్ష్యంగా కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా విజ్ఞాన ప్రదర్శనలను నిర్వహిస్తోంది. వారి ఆలోచనలకు అనుగుణంగా నమూనాలను రూపొందించి ప్రదర్శించే అవకాశం కల్పిస్తారు. 2023-24కు సంబంధించి ఇన్‌స్పైర్ మనక్, ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. గతేడాది వరకు ఈ రెండింటిని వేర్వేరుగా ఏర్పాటు చేయగా, ఈ సారి ఒకేసారి నిర్వహించాలని కేంద్రం ఆదేశించింది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఈ మేరకు ప్రదర్శనలను నవంబరులో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉపాధ్యాయులు దృష్టిసారించాలి..



విద్యార్థులు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు సిద్ధం కావాలి. ఇందులో పాల్గొనేందుకు విద్యాశాఖ గుగూల్ ఫామ్‌లో నవంబరు మొదటి వారం లోపు వివరాలు నమోదు చేయాలి. అదే నెలలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తాం. మరోవైపు ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికైన వారు సైతం సిద్ధం కావాలి. గైడ్ ఉపాధ్యాయులు ఈ దిశగా దృష్టిసారించాలి.

- సిద్దారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, సంగారెడ్డి

ఇన్‌స్పైర్‌లో ఎంపికైనవే..

ఈ సారి రెండు ప్రదర్శనలు కలిపి నిర్వహిస్తున్నా.. ఇన్‌స్పైర్ మనక్‌లో మాత్రం కేవలం ఎంపిక చేసిన విద్యార్థులు మాత్రమే పాల్గొనాలి. ఇందుకు ఒక్కో విద్యార్థికి ప్రాజెక్టు తయారీ నిమిత్తం రూ.10 వేలు వారి ఖాతాలో జమచేస్తారు. అంతర్జాలంలో నమోదు చేసిన నమూనాను మాత్రమే ప్రదర్శించాలి. ఇన్‌స్పైర్ మనక్‌లో గతేడాది ఆరు నమూనాలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాల నుంచి రెండు చొప్పున ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. మెదక్ నుంచి ఒక్కటీ ఎంపిక కాలేదు.

నిర్దేశించిన అంశాలు

ప్రధాన: సుస్థిర భవిష్యత్తుకు శాస్త్ర సాంకేతిక

ఉప అంశాలు

1. ఆరోగ్యం, ఆహారం, పరిశుభ్రత
2. రవాణా కమ్యూనికేషన్
3. సహజ వ్యవసాయం
4. విపత్తుల నిర్వహణ
5. గణిత నమూనాలు, గణన ఆలోచన
6. వ్యర్థాల నిర్వహణ
7. వనరుల నిర్వహణ

14 మందికి..

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జూనియర్ విభాగంలో 6-8 తరగతులు, సీనియర్ విభాగంలో 9, 10 తరగతులకు అవకాశం కల్పిస్తారు. నిర్దేశించిన ప్రధానంశంతో పాటు ఉప అంశాల్లో నమూనాలు తయారు చేయాలి. ఒక్కో పాఠశాల నుంచి 14 మంది పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ఒక ఉపాధ్యాయుడు గైడ్‌గా వ్యవహరిస్తారు. మరోవైపు ఉపాధ్యాయులు, బీఈడీ, డీఈడీ విద్యార్థులు సైతం తాము రూపొందించిన నమూనాలను ప్రదర్శించవచ్చు. ఇందుకు విద్యాశాఖకు సంబంధించిన గుగూల్ ఫామ్‌లో పూర్తి వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది.

నాలుగు జిల్లాల్లో ఎంపిక ఇలా..			
సంగారెడ్డి	93	సిద్దిపేట	188
మెదక్	38	వికారాబాద్	54

ప్రయాణికులను సురక్షితంగా చేర్చడమే లక్ష్యం



పురస్కారాలు అందుకున్న సిబ్బందితో ఆర్ఎం ప్రభులత, డిపో మేనేజర్ సురేఖ, అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యం ముందుకు సాగాలని ఆర్టీసీ మెదక్ ప్రాంతీయ మేనేజర్ ప్రభులత సిబ్బందికి సూచించారు. శుక్రవారం మెదక్ ఆర్టీసీ డిపో, గ్యారేజ్‌ను పరిశీలించి డిపో మేనేజర్ సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉద్యోగుల అభినందన సభకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రజల్లో ఆర్టీసీపై ఆదరణ పెరిగేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రశంసా పత్రం, నగదు పురస్కారాలు అందజేశారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన ఆరుగురు మహిళలను ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు, కార్యాలయ పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో అడవి పందుల కళేబరాలపై ఆందోళన

కొడంగల్, న్యూస్‌టుడే: అంగడిరైచూర్‌లోని పొలాల్లో అడవి పందుల కళేబరాలు శుక్రవారం ప్రత్యక్షం కావడంతో స్థానికంగా కలకలం రేగింది. చిరుత వచ్చి వాటిపై దాడి చేసి ఉంటుందని రైతులు ఆందోళన చెందారు. ఈ విషయం అటవీశాఖ అధికారులకు తెలపగా వారు పొలాలకు వెళ్లి ఆనవాళ్లను పరిశీలించారు. స్థానికంగా లభించిన ఆధారాల ప్రకారం.. అవి చిరుత కాదని హైనా సంచరించి ఉంటుందని సెక్షన్ అధికారి రతన్‌సింగ్ తెలిపారు.

'బలవంతపు భూసేకరణ సరికాదు'

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: ఫార్మా కంపెనీల కోసం దుద్యాల మండలంలో ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు సేకరించడం సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య అన్నారు. శుక్రవారం ప్రజా సంఘాల నాయకులతో కలిసి బొంరాస్‌పేటలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ నాయకులు చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలకు తాఖీదులు

పరిగి, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా పాఠశాలను నిర్వహిస్తున్న ఓ పాఠశాలకు మండల విద్యాధికారి గోపాల్ శుక్రవారం తాఖీదులు జారీ చేశారు. ప్రారంభానికి అవసరమైన పత్రాలను మూడు రోజుల్లోగా అందజేయాలని లేదంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

గుడుంబా విక్రేతల బైండోవర్

యాలాల, న్యూస్‌టుడే: బాణాపూర్ తండాలో గుడుంబా తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఆబ్కారీ అధికారులు దాడులు నిర్వహించారు. వర్త్య శ్రీనివాస్, మునీబాయి దంపతులు ఇంట్లో గుడుంబా తయారుచేస్తుండగా రెండు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు, వారిని అదుపులోకి తీసుకొని ఎక్సైజ్ స్టేషన్ తరలించారు. అనంతరం తహసీల్దారు అంజయ్య ఎదుట బైండోవర్ చేశారు.

దారూ.. పల్లెల్లో జోరు!

యథేచ్ఛగా మద్యం విక్రయాలు

న్యూస్‌టుడే, కొడంగల్

పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. కొన్ని గ్రామాల్లో కిరాణం నుంచి టీ దుకాణాల వరకూ ప్రతి చోటా లభించడం ఆందోళన కల్గిస్తోంది. అనుమతి లేని అమ్మకాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో ఇటీవల ఈ దందా జోరందుకుంది.

కొండారెడ్డి పల్లె మినహా..

కొడంగల్ పరిధిలోని చాలా గ్రామాల్లో యువకులు మద్యానికి బానిసలై ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకొన్నారు. ఆయా గ్రామాల పెద్దలు, యువకులు కలిసి సమావేశాలు నిర్వహించారు. అందరి సమ్మతితో చాలా చోట్ల సారాయి అమ్మకాల్ని బహిష్కరించారు. అనుమతి లేకుండా అమ్మితే రూ.50 వేల జరిమానా విధించాలని నిర్ణయం తీసుకుని.. ఇదే విషయాన్ని ఆబ్కారీ అధికారులకూ విన్నవించారు. ముఖ్యంగా బొంరాస్‌పేట మండలంలోని ఎన్కేపల్లి, కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి, అంగడి రైచూర్, అన్నారం, కొండారెడ్డిపల్లి గ్రామాలు కట్టుదిట్టంగా అమ్మకాల్ని నిలిపివేశాయి. కానీ



ప్రస్తుతం కొండారెడ్డిపల్లి గ్రామం మినహా ఎక్కడా.. ఆ పరిస్థితి లేదు.

అమ్మకాలు ఇలా..

- కొడంగల్ మండలంలోని 26 గ్రామాలకు.. 03 మద్యం దుకాణాలు, సుమారుగా 150 గొలుసు షాపులున్నాయి.
- బొంరాస్‌పేట మండలంలోని 33 గ్రామాల్లో 01 మద్యం దుకాణం ఉండగా.. దాదాపు 85 గొలుసు షాపులున్నాయి.
- దుద్యాల మండలంలోని 14 గ్రామాల్లో 01 అనుమతి పొందిన దుకాణం ఉండగా.. సుమారు 36 గొలుసు దుకాణాలు ఉన్నాయి.
- దౌల్తాబాద్ మండలంలోని 33 గ్రామాల్లో 02 మద్యం దుకాణాలు ఉండగా.. దాదాపు 106 గొలుసు దుకాణాలు ఉన్నాయి.

నిత్యం ప్రమాదాలు..

కొడంగల్ పరిధిలోని మూడు మండలాలు హైదరాబాద్, బీజాపూర్ జాతీయ రహదారిపై ఉన్నాయి. ఈ రహదారిపై ప్రతి నెలా సుమారు 12 నుంచి 20 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో దాదాపు 16 ప్రమాదాలు మద్యం మత్తులో జరిగినవే అని పోలీసులు, వైద్యులు తేల్చారు. జాతీయ రహదారిపై మద్యం దుకాణాలతో పాటు గొలుసు దుకాణాలు ఉండటంతో యువత మద్యం తాగి ప్రాణాలు పోగొట్టుకొంటున్నారు.

ఎప్పటికప్పుడు కేసులు పెడుతున్నాం

గొలుసు దుకాణాలపై ఎప్పటికప్పుడు కేసులు చేస్తున్నాం. అక్రమంగా మద్యం విక్రయించిన వారిపై ఇప్పటికే పలుమార్లు కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరచడం జరిగింది. గ్రామాల్లో గొలుసు దుకాణాలు ఉంటే ఏవరైనా ఫోన్ ద్వారా సమాచారం అందించినా చర్యలు తీసుకొంటాం.

వెంకటేశ్వర్లు, ఆబ్కారీ సీఐ, కొడంగల్

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, పరిగి: ? పరిగి మున్సిపాలిటీలోకి నస్కల్ గ్రామాన్ని విలీనం చేస్తే అనేక రకాలుగా నష్టపోవాల్సి వస్తుంది. వ్యవసాయంపైనే ఆధారపడ్డ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగానే కొనసాగించాలి. అధికారులు తమ ప్రతిపాదనను విరమించుకోవాలి.
– కె.శ్రీనివాస్, బాల్‌రాజ్, నస్కల్

✓ మున్సిపాలిటీలో కలపాలన్న ప్రతిపాదన కూడా ఇంకా రాలేదు. అభ్యంతరాలు ఉంటే గ్రామస్థులు ప్రభుత్వానికి తెలియజేయవచ్చు.
– వెంకటయ్య, కమిషనర్, మున్సిపాలిటీ

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ: ? హన్మ్యానాయక్ తండాలో విద్యుత్తు తీగలు ఇళ్ల మధ్యన వేలాడుతూ కనిపిస్తున్నాయి. తీగలు ఒకదానికి ఒకటి తాకితే ప్రమాదం జరగడానికి అవకాశం ఉంది. చాలా రోజులుగా ఈ సమస్య ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. సమస్య పరిష్కరించేలా చూడాలి. – చందర్, స్థానికుడు

✓ గ్రామాల్లో విద్యుత్తు తీగల సమస్యను పరిష్కరించేలా చూస్తున్నాం. హన్మ్యానాయక్ తండాలో విద్యుత్తు తీగలు ఇళ్ల మధ్యన ప్రమాదకరంగా ఉన్నాయనే సమస్య మా దృష్టికి వచ్చింది. తీగలు వేలాడకుండా సరిచేయించి సమస్య పరిష్కరించేలా చూస్తాం.
– సాయికిరణ్, ఏఈ విద్యుత్తు శాఖ.

న్యూస్‌టుడే, పూడూరు: ? స్థానిక ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఆవరణలోకి పశువులు, కుక్కలు సంచరిస్తున్నాయి. దీంతో చిన్నారులకు ఇబ్బందిగా మారింది. – నారాయణ, సోమన్‌గుర్తి

✓ ప్రహరీలు అవసరమున్న పాఠశాలలను గుర్తించి నిర్మాణం కోసం నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతాం.
– సాయిరెడ్డి, ఇన్‌ఛార్జి ఎంఈవో.

న్యూస్‌టుడే, దౌల్తాబాద్: ? అంబేడ్కర్ కూడలి నుంచి ఈదమ్మ దేవాలయం వరకు విద్యుత్తు దీపాలు లేక ఆప్రాంతాల వాసులు అవస్థలు పడుతున్నారు. అధికారులు వీధి దీపాలు అమర్చేలా చూడాలి.
– నారాయణ, దౌల్తాబాద్

✓ ఈప్రాంతంలో నూతన విద్యుత్తు లైన్ కోసం ప్రతిపాదనలు పంపించాం. లైన్‌తో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం.
– గోవిందు, లైన్‌మెన్ దౌల్తాబాద్.

న్యూస్‌టుడే, ధారూర్: ? మిషన్ భగీరథ నల్లాలకు కొన్నిచోట్ల ఆన్‌ఆఫ్ మీటలు లేక తాగునీరు వృథా అవుతోంది. – నర్సింలు, నాగసమందర్

✓పరిశీలించి నల్లాలకు మీటలు ఏర్పాటు చేస్తాం. – రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగసమందర్.

అటకెక్కిన 'రైతు సేవలు'

- కర్షకులకు అందని ఎరువులు, విత్తనాలు
- చేతులెత్తేసిన జిల్లా డీసీఎంఎస్

న్యూస్‌టుడే, పరిగి

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు, విత్తనాలను విక్రయిస్తూ అన్నదాతల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం (డీసీఎంఎస్) ఆధ్వర్యంలో పదేళ్ల క్రితం వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు సేవా కేంద్రం ప్రారంభించారు. దీంతో బహిరంగ విపణిలో అధిక ధరలకు విక్రయాలు జరగకుండా అడ్డుకట్ట పడింది. అలాంటిది దాదాపు ఏడాది కాలంగా మూత పడడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. నష్టాలు వస్తున్నాయన్న సాకుతో అధికారులు సేవకు మంగళం పలికారు. వెరసి మళ్లీ అధిక ధరలకే రైతులు వాటిని కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారు.



సాగుకు సన్నాహం

ఎన్నికల సమయంలో..

శాసనసభ ఎన్నికల కోసం అధికారులు వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాములను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అందులోనే గోడల మార్పులు చేర్పులు చేసి లెక్కింపు కేంద్రాన్ని నిర్వహించారు. ఇందుకోసం అందులో ఉన్న ఎరువులను ఖాళీ చేయించారు. ఎన్నికలు ముగిసినా తిరిగి ఇప్పటి వరకు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన వాటితో పాటు తక్కువ ధరలకు విక్రయాలు అమ్మడం కారణంగా కేంద్రం రైతుల ఆదరాభిమానాలను చూరగొంది. యాసంగి సీజన్ కావడంతో ఎరువులు, విత్తనాల కొనుగోళ్లలో తలమునకలయ్యారు. సేవలు ఎప్పుడెప్పుడు ప్రారంభిస్తారా? అని కర్షకులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

32వేల ఎకరాల్లో..

ఇప్పటికే రెండో పంట కింద ఆరుతడి పంటల సాగుకు ఉపక్రమించారు. ఒకప్పుడు పరిగిలోని డీసీఎంఎస్ నుంచే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరి విత్తనాలు పంపిణీ అయ్యేది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రాసెసింగ్ ప్లాంటు దెబ్బతిన్నది. పూడూరు మండలంలో 6,522 ఎకరాలు, పరిగి మండలంలో 8,564, కుల్కచర్ల మండలంలో 4,786, దోమ మండలంలో 9,761, చౌడాపూర్ మండలంలో 3,007 ఎకరాల్లో రబీ సాధారణ సాగు ఉంది. ఆయా మండలాల్లో మొత్తంగా 32,640 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి రానున్నాయి. ప్రధానంగా డీఏపీ, యూరియా, పొటాష్, కాంప్లెక్సు ఎరువులు అవసరం. డీసీఎంఎస్‌కు నేరుగా ఎరువుల కంపెనీల నుంచి సరఫరా కావడంతో పైసా కూడా ఎక్కువ ధరలకు అమ్మారు. ఎరువులు ఉన్నంత వరకు కార్యాలయం వద్దనే విక్రయించారు. అవి కూడా పూర్తికావడం, యార్డులో ఉన్న గోదాం తెరుచుకోకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. గ్రామాల్లో మాత్రం యూరియా బస్తాకు రూ.24 అధికంగా వసూలు చేస్తున్నారు. వ్యాపారులు అదను చూసి దండుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా కేంద్రాన్ని ప్రారంభించేలా చూడాలని డివిజన్ రైతులు కోరుతున్నారు.

అక్రమాలకు కళ్లెం

- ఎరుపతి నర్సింహారెడ్డి, రైతు, సయ్యద్‌పల్లి

వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తుంటారు. సేవా కేంద్రంలో తక్కువకు లభిస్తాయి. రైతులు నష్టపోకుండా ఉండేందుకు పున:ప్రారంభించాలి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం

- వెంకటయ్య, మేనేజర్, డీసీఎంఎస్

గతంలో మార్క్‌ఫెడ్ వారు రవాణా ఛార్జీలు తీసుకోకుండా ఎరువులు అందజేసేది. ప్రస్తుతం ఛార్జీల భారం డీసీఎంఎస్‌పై వేయడంతో నిర్ణీత ధరలకు అమ్మడం కష్టం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

మహిళలు తలచుకుంటే సాధించలేనిది లేదు

బంట్వారం: మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని ఎంపీడీవో రాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో మహిళా సమైక్య సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలను వెచ్చిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం దేవయ్య ఎంపీవో నాగరాజు ఏపీవో సుధాకర్, సీసీలు ప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బోధకుల్ని నియమించండి

బొంరాస్‌పేట: వడిచెర్ల యూపీఎస్‌లో ముగ్గురు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని గ్రామానికి చెందిన యువకులు కిష్టప్ప, పుల్లప్ప, శ్రీనివాస్ తదితరులు డిమాండ్ చేశారు. శుక్రవారం కడా ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో 81 మంది విద్యార్థులకు ముగ్గురే టీచర్లు ఉన్నారని, బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం నేడు

షాబాద్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని షాబాద్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక ఎంఎస్ గార్డెన్ ఫంక్షన్ హాలులో కార్యక్రమం ప్రారంభం అవుతుందని యువత పాల్గొనాలని కోరారు.

ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

పరిగి, న్యూస్‌టుడే: ఆర్టీసీ డిపో అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డిపోలో ఆవరణలో జరిగిన గ్యార్వీలో పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హనుమంతు మాట్లాడుతూ.. సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఎం కరుణశ్రీ, పట్టణాధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న రామ్మోహన్‌రెడ్డి, ఉద్యోగ సంఘం నాయకులు

- ఆర్టీసీ డిపోలో ఆవరణలో నిర్వహించిన గ్యార్వీలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడి పాల్గొన్నారు. ఆయన వెంట పుర ఛైర్మన్ అశోక్‌కుమార్, విపణి మాజీ ఛైర్మన్లు ఆర్.ఆంజనేయులు, ఎ.సురేందర్, బి.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మండల సొసైటీ ఉపాధ్యక్షుడు ఎస్.భాస్కర్ పాల్గొన్నారు.

పూడూరు: గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కేరవెళ్లి నుంచి హైదరాబాద్, బీజాపూర్ జాతీయ రహదారి వరకు రూ.1.10 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, మాజీ సర్పంచి కరీం, కాటం నర్సింలు, కేరవెళ్లి సీతారాంరెడ్డి, కద్మూరు ఆనందం భాస్కర్, మోయిన్‌పాషా, ఇబ్రహీం, సాదిక్, నవాజ్, రాంచంద్రయ్య, పెంటయ్య, రాజు, ఏఈ చాణక్యరెడ్డి ఉన్నారు.

పెద్దఉమ్మెంతాల్‌లో ప్రత్యేక పూజలు: పెద్దఉమ్మెంతాల్ తిరుమలనాథ స్వామి ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందించారు.

మత్స్యకారుల ప్రగతికి కృషి

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: మత్స్యకారుల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తోందని తాండూరు వ్యవసాయ విపణి అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. తాండూరు మండలం అల్లాపూర్ జలాశయంలో శుక్రవారం మత్స్యశాఖ జిల్లా అధికారి వెంకన్నతో కలిసి ఆయన రూ.1.20లక్షలు విలువజేసే 78వేల చేప పిల్లలను వదిలారు. మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి సరిత పాల్గొన్నారు.



చేప పిల్లలు వదులుతున్న బాల్‌రెడ్డి, వెంకన్న

వేగ నిరోధకాలు ఏర్పాటు

పూడూరు, న్యూస్‌టుడే: 'ప్రాణం గాల్లో దీపం' రక్తమోడుతున్న హైదరాబాద్, బీజాపూర్ హైవే అనే శీర్షికన ఈనెల 19న 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జాతీయ రహదారి అధికారులతో కలిసి పూడూరు గేటుతో పాటు, ప్రమాదకరంగా మారిన ప్రదేశాల్లో వేగనిరోధకాలు ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. ప్రమాదాల నివారణకు వేగ నియంత్రణతోపాటు తగిన చర్యలు తీసుకుంటామనారు.

ఈనాడు కథనానికి స్పందన



వరిపంట నూర్పిళ్లు షురూ..

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: పలు గ్రామాల్లో వరిపంట నూర్పిళ్లు ప్రారంభమయ్యాయి. అన్నదాతలు తమ బోరుబావుల దగ్గర సాగుచేసిన వరి పంటల్ని శుక్రవారం నుంచి కోతలు ప్రారంభించారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం

కొడంగల్: పత్తి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మార్కెట్ ఛైర్మన్ అంబయ్య ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు తమ పత్తిని సీసీఐ ద్వారా విక్రయించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



పత్తిమిల్లుకు వచ్చిన ట్రాక్టర్‌కు పూజలు

వేతన బకాయిలు చెల్లించాలి

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో డీఏవో ఫరీనా ఖాతూన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబర్‌సింగ్, చిన్నమ్మ, సత్తిబాయి, ప్రమీల, లక్ష్మి, సంతోష పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, ఏఎన్ఎంలు

పెద్దేముల్‌లో పర్యటించిన మహేందర్ రెడ్డి

పెద్దేముల్, తాండూరు, న్యూస్‌టుడే: శాసనమండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి శుక్రవారం పెద్దేముల్‌లో పర్యటించారు. గ్రామంలోని సీనియర్ నాయకుల ఇళ్లకు వెళ్లి రాజకీయంగా చోటు చేసుకున్న పరిణామాలపై చర్చించారు. మాజీ సర్పంచి కిషన్‌రావు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, రాఘవేందర్‌రెడ్డి ఉన్నారు. తాండూరులో హోంగార్డు లింగయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని మహేందర్‌రెడ్డి పరామర్శించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

యాలాల, న్యూస్‌టుడే: కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటానని, శాసనమండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాలాలలో కార్యకర్త పాండు తల్లి బుచ్చమ్మ ఇటీవల మరణించడంతో, కుటుంబాన్ని పరామర్శించారు.

చేతి పంపులను వాడకంలోకి తెస్తే మేలు

పూడూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లోని చేతిపంపులను అందుబాటులోకి తేవాలని మిషన్ భగీరథ డీఈఈ సుబ్రహ్మణ్యం అన్నారు. గ్రామీణ మంచినీటి సరఫరా సహాయకులకు మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పాండు, ఎంపీవో సుందర్, గ్రిడ్ ఏఈ విపుల్, శిక్షకులు మహిపాల్ రెడ్డి ఉన్నారు.

ముట్టడికి బయలుదేరిన కార్మికులు

వికారాబాద్ మున్సిపాలిటీ: పురపాలిక కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ.. శుక్రవారం చలో రాష్ట్ర కమిషనర్ కార్యాలయ ముట్టడికి కార్మికులు బయలుదేరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ మాట్లాడారు. నాయకులు భాస్కర్, లక్ష్మమ్మ, జంగమ్మ, జనార్దన్ పాల్గొన్నారు.

శౌచాలయాలు అసంపూర్తి.. అవస్థలు సంపూర్తి

న్యూస్‌టుడే, పరిగి గ్రామీణ, దోమ

సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాలు కరవై విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పరిగి నియోజక వర్గ పరిధిలో కొన్ని పాఠశాలలో శౌచాలయాలున్నా.. నిర్వహణ లేక కంపు కొడుతున్నాయి. ఇటీవల అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద బడులకు నిధులు మంజూరై మరమ్మతు పనులు జరిగాయి. కానీ చాలా చోట్ల భారీ సంఖ్యలో విద్యార్థులున్నా.. శౌచాలయాల నిర్మాణం జరగక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.

మచ్చుకి కొన్ని..

- పరిగి మండల పరిధిలోని జాఫర్‌పల్లి ఆదర్శ పాఠశాల, కళాశాలలో మొత్తం 685 మంది విద్యార్థులు చదువుతున్నారు. సగానికి సగం బాలికలున్నా.. కేవలం 4 శౌచాలయాలు ఉన్నాయి. సమయాభావంతో ఒక్కసారిగా వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. బాలురకు శౌచాలయాలు లేని కారణంగా పరిసరాల్లోనే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు.
- పరిగి మండలం రాంరెడ్డిపల్లి, ఇబ్రహీంపూర్ తండాలోని ప్రాథమిక పాఠశాలల్లో శౌచాలయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- పరిగిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నెం.1 పాఠశాలలో 169 మంది బాలికలుండగా, 407 మంది బాలురున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీరంతా నేరుగా బాలురు వాడే శౌచాలయాల్లోకి చేరి బురదలో కూరుకుపోయాయి. నిర్వహణలేక అక్కడ ఏర్పాటు చేసిన తొట్టిలో నీటిని నింపక తప్పని పరిస్థితుల్లో విద్యార్థులు అలాగే వెళ్లి వస్తున్నారు.



పరిగి జెడ్పీహెచ్ నెం.1 పాఠశాలలో దుస్థితి

- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నెం.2లో మొత్తం 370 మంది విద్యార్థులున్నా.. శౌచాలయాలు లేవు. కొత్తవి నిర్మించాలన్న లక్ష్యంతో 4 ఏళ్ల క్రితం కలెక్టర్ పాతవాటిని ధ్వంసం చేయించారు. కానీ ఇప్పటి వరకు శౌచాలయాల నిర్మాణం జరక్క ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.
- దాదాపు 163 మంది విద్యార్థులున్న దోమ మండలం మోత్కూరు ఉన్నత పాఠశాలలో శౌచాలయాల నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి.
- దోమ ఉన్నత పాఠశాలలో 356 మంది విద్యార్థులుండగా.. బాలికల కోసం 4 ఉన్నాయి. బాలురకు సదుపాయం లేక అర కిలోమీటరు దూరం వెళ్లాల్సిన పరిస్థితి. 98 మంది చదువుతున్న ప్రాథమికలో మరమ్మతుకు గురయ్యాయి.
-



కిష్టాపూర్ పాఠశాలలో అసంపూర్తిగా ..

దాదాపు 333 మంది చదువుతున్న కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో 2 శౌచాలయాలుండగా అవి కూడా ఉపాధ్యాయులు వినియోగిస్తున్నారు. మరో రెండు నిర్మిస్తున్నా.. అవి అసంపూర్తిగానే ఉన్నాయి.
- దాదాపూర్‌లో 406 మంది విద్యార్థులుండగా.. ఓ స్వచ్ఛంద సంస్థ 4 శౌచాలయాలు నిర్మించింది. బాలురకు సౌకర్యం లేక ఇబ్బందులు తప్పడం లేదు.
- కుల్కచర్ల మండలం కుసుమసముద్రం ఉన్నత పాఠశాలలో 70 మంది చదువుతుండగా.. ఉన్న రెండు శౌచాలయాలు కంపుకొడుతున్నాయి.
- 35 మంది చదువుతున్న కెరవెళ్లి ప్రాథమిక పాఠశాలలో అసలే నిర్మాణం జరగలేదు.

శాశ్వత పరిష్కారానికి కృషి

అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద కొన్ని పాఠశాలల్లో శౌచాలయాల మరమ్మతులు పూర్తయ్యాయి. మిగిలిన పాఠశాలల్లో సమస్యలుంటే ప్రధానోపాధ్యాయులు మా దృష్టికి తీసుకుని వస్తే.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం. – గోపాల్, మండల విద్యాధికారి, పరిగి

బాధిత కుటుంబానికి సహాయం

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించినట్లు పీఎన్‌పీఎస్ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. ఘనాపూర్‌లో వృద్ధురాలు సాయమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆయన బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు.

క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించండి

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: దివ్యాంగులకు ఇంటివద్ద క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించాలని ఎంఈవో హరిలాల్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రతి వారం నిర్వహించే క్యాంపులో లోపాలున్న పిల్లలను తీసుకురావాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని, సూర్యానాయక్‌తండా పాఠశాలను సందర్శించారు.

స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ రేపు

పూడూరు, న్యూస్‌టుడే: కంకల్‌లో స్వామివివేకానంద విగ్రహావిష్కరణ ఈనెల 27న ఆదివారం ఉంటుందని వీరభద్ర యూత్ కమిటీ అధ్యక్షుడు రఘుపంతులు, ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ తెలిపారు.